క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మండపేట: సంగమేశ్వరస్వామివారి రథోత్సవం నేపథ్యంలో మండపేట సబ్ డివిజన్‌లోని మండపేట, ద్వారపూడి, ఆలమూరు సెక్షన్ల పరిధిలో సోమవారం మధ్యాహ్నం 1 గంట నుంచి ఐదు గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ తిరుమలరావు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కుంగ్ ఫూ పోటీల్లో పలువురికి బెల్టులు



బెల్ట్ టెస్టులో విజేతలతో రాజుబాబు

మండపేట: స్థానిక గోల్డ్ మార్కెట్ వద్ద కుంగ్ ఫూ విద్యార్థులకు ఆదివారం బెల్ట్ టెస్టులు నిర్వహించారు. ఈ పోటీల్లో కె.వెంకటతరుణ్ బ్రౌన్ బెల్ట్ సాధించగా, ఎం.కృష్ణ శ్రీకృతి పర్పుల్ బెల్ట్, పి.హనీత్ బ్లూ బెల్ట్, డి.రాకేష్, ఎం.అభిషక్ పాల్, ఏడీఎస్‌కే వినయ్ గ్రీన్ బెల్టులు సాధించారు. అలాగే ఐ.రామ సత్యకిరణ్ కుమార్, జి.ధీరజ్, జి.అభిరాజ్, పి.రిషిత్‌లు ఎల్లో బెల్ట్‌లను కైవసం చేసుకున్నారు. విజేతలను మండపేటకు చెందిన న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్, గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజుబాబు అభినందించి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా డబ్ల్యూయూఎస్‌హెచ్‌యూ అసోసియేషన్‌కు మండపేట నుంచి తనను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్టు రాజుబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన రౌతు సత్యనారాయణ తన బైక్‌పై యానం వెళుతున్నారు. మండలంలోని కోలంక వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలోకి బైక్‌తో సహా పల్టీలు కొట్టాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం యానం ఆసుపత్రికి తరలించారు.

ఎదురుబిడియం కొంపలకు దారేది..



గతుకులమయంగా మారిన ఎదురుబిడియం కొంపలు రహదారి

కె.గంగవరం: మండలంలోని కుడుపూరు శివారు ఎదురుబిడియం కొంపలు గ్రామానికి దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కుడుపూరు గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఎదురుబిడియం కొంపలు గ్రామం ఉంది. ఈ గ్రామానికి పంట చేలో నుంచి ఉన్న కంకర రహదారే దిక్కు. పంట చేలోని నీరు రోడ్డుపైకి వచ్చి కనీసం నడవడానికి కూడా ఉండడం లేదని వర్షాకాలంలో అయితే గ్రామానికి రాకపోకలు ఉండవని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నామని ఇప్పుడైనా అధికారులు గ్రామాన్ని గుర్తించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీడీపీ నేతలపై కేసులు దారుణం

మండపేట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అనపర్తి పర్యటనలో పోలీసులు ఆంక్షలు విధించడంతో పాటు కేసులు నమోదు చేయడం దారుణమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ముందుగా అనుమతి తీసుకుని పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడిని అనుమతి లేదని చెప్పి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆయనతో పాటు మరికొందరు టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని ఎమ్మెల్యే వేగుళ్ల ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు.

తారకరత్న మృతికి సంతాపం

మండపేట: ప్రముఖ సినీనటుడు తారకరత్న మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తదితరులు ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రైతన్నా .. ఈ-కేవైసీకి త్వరపడన్నా

- నమోదుకు ఈ నెల 25 వరకూ అవకాశం
- క్లస్టర్ పరిధిలో 1.02 లక్షల ఎకరాల్లో వరి
- 1,628.02 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు
- ఇప్పటి వరకూ 66 శాతం పూర్తి



ఈ-కేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ-పంట విధానాన్ని అమలు చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తోంది. అంతేగాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంట నష్టపోకుండా చూస్తోంది. పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఈ ప్రయోజనాన్నీ రైతు అందాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి. 'వ్యవసాయం దండగ కాదు..పండగ ' అని చేసి చూపిస్తానంటూ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్షరాలా నెరవేరుస్తున్నారు. రైతుల ప్రయోజనం కోసం చేపడుతున్న చర్యలతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ-క్రాప్‌లో పంట నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో, రైతులు ఆధార్ అనుసంధానం చేయించుకోవడం కూడా అంతే అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి రైతూ ఈకేవైసీని చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ప్రయోజనాలెన్నో

ఈ-క్రాప్‌లో రైతులు పంట నమోదు చేసుకోవడం వలన పలు ప్రయోజనాలు ఉన్నాయి. పెట్టుబడి సాయం అందించడం, పంటకు బీమా, నష్ట పరిహారం చెల్లించడం, పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు అందించడం ఇలా అన్నీ ఈ-క్రాప్ నమోదుతో సులభతరం కానున్నాయి. ఈ కర్షక్ యాప్‌లో ప్రతి రైతు వివరాలను నమోదు చేస్తున్నారు. నూతన విధానంలో మొదట ఆర్‌బీకేల్లో రైతుల వివరాల నమోదు, అనంతరం క్షేత్రస్థాయిలో పంట నమోదు, చివరగా ప్రతి రైతు ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉంది. దీని వలన పంట అమ్ముకునే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. అయితే ఈ నెల 25తో ఈకేవైసీకి గడువు ముగుస్తున్నందున పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతూ ఈకైవైసీకి త్వరపడాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో 1.02 లక్షల ఎకరాల్లో వరి, 5,800.61 ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ 38,077 మంది రైతులు 66,786 ఎకరాల్లో 66 శాతం మేరకు ఈకేవైసీని పూర్తి చేయించుకున్నారు. మిగిలిన రైతులు కూడా ఈ నెల 25లోగా పూర్తి చేయించుకోవాల్సి ఉంది.

రైతులు త్వరపడాలి



పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నాం. రైతుల పొలం వద్దకే వెళ్లి పంటల వివరాలు నమోదు చేస్తున్నాం. పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలి. అప్పుడే పథకం లబ్ధి వారికి వర్తిస్తుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం మండలం

వరిసాగు నమోదు ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	పంట నమోదు (ఎకరాల్లో)	ఈకేవైసీ పూర్తి (ఎకరాల్లో)
మండపేట	17,222.5	15,138.95	9,942.41
కపిలేశ్వరపురం	16,156	15,871.09	11,840.12
రాయవరం	14,825	13,724.91	10,817.34
రామచంద్రపురం	19,007.5	17,416.10	12,481.28
కె.గంగవరం	15,882.5	14,940.56	9,966.68
కాజులూరు	18,973	18,200.25	12,740.65

దాతలు ముందుకు రావాలి



కాజులూరులో వెంకటరత్నానికి ఆర్థిక సాయం అందిస్తున్న అమ్మిరాజు తదితరులు

కాజులూరు: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ఉదారత కలిగిన దాతలు ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాగాపు అమ్మిరాజు అన్నారు. కాజులూరుకు చెందిన పడాల వెంకటరత్నంకు కిడ్నీ సమస్య తలెత్తటంతో కుటుంబీకులు ఆసుపత్రిలో చేర్పించారు. తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యులు ఆపరేషన్ చేసి కిడ్నీ తొలగించారు. ఆ పై వైద్యఖర్చుల నిమిత్తం వెంకటరత్నం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. విషయం తెలుసుకున్న మాగాపు అమ్మిరాజు నియోజకవర్గ కాపు ఐక్యత సభ్యుల సహకారంతో రూ.20 వేలు ఆదివారం వెంకటరత్నంకు అందజేశారు. కార్యక్రమంలో నామా వెంకన్నబాబు, కంచర్ల చక్రి, ఆళ్ళ బుజ్జి, అల్లం రామ కృష్ణ, కర్రి తాతాలు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్ర పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామికి గో ఆధారిత పదార్థాలతో అభిషేకించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు డి.లక్ష్మణ మూర్తి, పి.రామస్వామి, వెల్ల శ్రీను, ఎస్. వెంకట్రావు, వి.కోటేశ్వరరావు పర్యవేక్షించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా..

మహా రుద్రయాగంలో పాల్గొన్న మంత్రి వేణు



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



మహా రుద్రయాగంలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా రుద్రయాగంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని సినిమాటోగ్రఫీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (వేణు) అన్నారు. సోమేశ్వరంలోని మహా రుద్రయాగంలో ఆయన ఆదివారం పాల్గొని పూజాదికాలు నిర్వహించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం యాగంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పరమ శివుని ఆజ్ఞ లేనిదే ఇంతటి మహత్కార్యం నెరవేర్చడం సాధ్యం కాదన్నారు. తొలుతగా మహా రుద్రయాగ కమిటీ మంత్రి వేణును పూర్ణ కుంభంతో స్వాగతించారు. కాగా శనివారం రాత్రి కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మహా రుద్రయాగంలో పాల్గొన్నారు. మహా రుద్రయాగంలో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వందమంది వేద పండితులు మహా రుద్రయాగాన్ని నిర్వహించారు. రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

నవ జనార్దనులకు పట్టు వస్త్రాలు



మడికిలో స్వామివారికి ఆహ్వాన పత్రిక, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: అర్తమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలకు నవ జనార్దన స్వామివార్లను ఆహ్వానిస్తూ శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈనెల 21 28 వరకూ వారం రోజుల పాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అందుకోసం ఇప్పటికే బులిస్వామిరెడ్డి, పెద్ద ఎత్తున గ్రామస్తులు గోవిందమాలలు ధరించారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కొలువైన నవ జనార్దన స్వామివార్లను వేడుకలకు ఆహ్వానిస్తూ ఆదివారం బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తమండలి సభ్యులు ధవళేశ్వరం, మడికి, జొన్నాడ, ఆలమూరు, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మాచర, మండపేట, కోటిపల్లిలోని నవ జనార్దన స్వామివార్ల ఆలయాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలు, స్వామివారు, దేవేరులకు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం సాంస్కృతిక, వేద పండితులు, ఆధ్యాత్మిక వేత్తలతో ప్రవచనాలు జరుగుతాయన్నారు. శ్రీవారి భక్త మండలి సభ్యులు సత్తి గోపాలరెడ్డి, సత్తి మంగయమ్మ, కర్రి సుబ్బారెడ్డి, కర్రి సుజాత, కర్రి సంతోషి, ఖండవల్లి భాస్కరాచార్యులు, సబ్బెళ్ల హరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ ఉద్యోగుల సహాయ నిరాకరణ



ద్రాక్షారామలో జరిగిన జీడీఎస్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న మునేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: గ్రామీణ తపాలా ఉద్యోగులు కేంద్ర సంఘాల పిలుపు మేరకు సోమవారం నుంచి సహాయ నిరాకరణ కార్యక్రమం చేపట్టినట్లు రామచంద్రపురం జీడీఎస్ ఉద్యోగుల కార్యదర్శి ఎస్‌వీవీ మునేశ్వరరావు అన్నారు. మండలంలోని ద్రాక్షారామలో ఆదివారం జీడీఎస్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మునేశ్వరరావు మాట్లాడుతూ చిరు ఉద్యోగులపై నిరంతరం వేధింపులు, ఒత్తిళ్లు ఆపాలని, 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులు సెలవు పెడితే తాత్కాలిక ఉద్యోగిని నియమించుకోవడానికి అనుమతి ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు సహాయ నిరాకరణ చేపడుతున్నట్లు వివరించారు. సోమవారం నుంచి అకౌంట్లు ఓపెనింగ్ చేయరాదని, మార్చి 2న రాజమహేంద్రవరం డివిజన్ ఆఫీసు వద్ద ధర్నా విజయవంతం చేయాలని, మార్చి 16, 17 లలో రెండు రోజుల సమ్మెను విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కోశాధికారులు వై.సర్వన్‌రాజు, వై.కామేశ్వరి, సంఘ మాజీ అధ్యక్షుడు జీవీకేజీ రామయ్య, గుండు రామకృష్ణ, వి.వీరయ్యచౌదరి, జి.రామకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా ఫణికుమార్



వీహెచ్‌పీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన ఫణికుమార్, రాఘవేంద్ర తదితరులు

రామచంద్రపురం: పట్టణ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నండూరి ఫణికుమార్ నియమితులయ్యారు. పట్టణంలోని అగస్తేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగిన విశ్వహిందూ పరిషత్ నాయకులు కేశవ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఫణికుమార్, ఉపాధ్యక్షులుగా కొప్పాల గణేష్, రెడ్డి రాంబాబు, కార్యదర్శిగా కేశవ రాఘవేంద్రలను నియమిస్తున్నట్లు సమావేశంలో నాయకులు ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా జిల్లా బీజేపీ యువమోర్చా సభ్యులు నాళం ఫణి, మండపేట భజరంగ్‌దళ్ అధ్యక్షుడు సూర్యపాపారావు, విశ్వహిందూ పరిషత్ గోశాల సభ్యులు సాయికిషోర్‌లు పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన వారిని సీనియర్ నాయకులు కొట్టువాడ హరిబాబు, శ్రీహరిపంతులు, జగదీష్ శ్రీను, కంచుమర్తి బాబూరావు, మూర్తి, రామకృష్ణ, ఆరాధి హనుమంత్, నేమాని సుబ్రహ్మణ్య శర్మ, సలాది సతీష్‌నాయుడు తదితరులు పాల్గొని అభినందన తెలిపారు.

నేడు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సోమవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎలుకల నివారణ మందు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 19 గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద సోమవారం ఎలుకల నివారణ నిమిత్తం రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. మండలానికి 72 కేజీలు మందు మంజూరైందని, మందును ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. నూకలు, నూనెలను రైతులు సమకూర్చుకుని రైతు భరోసా కేంద్రాల వద్ద తీసుకోవాలని సూచించారు.

ఓటమి ఎరుగని వీరుడు శివాజీ

జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ



మోటారు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

మండపేట: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఆదివారం మండపేటలో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, మండపేట ప్రఖండ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. వీహెచ్‌పీ నాయకులు గాడేపల్లి షణ్ముఖ శ్రీనివాస్, అయినవిల్లి రుద్ర శర్మ, బలిరెడ్డి సత్యనారాయణ, కోన సత్యనారాయణ, సాయిరాం తదితరులు ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటమి ఎరుగని వీరుడు శివాజీ అని, హిందూ ధర్మ పరిరక్షణకు ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆ మహావీరుడ్ని ఆదర్శంగా తీసుకుని హిందూ ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం రథం గుడి వద్ద నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

జేవీవీ ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్‌పై పరీక్ష



పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తున్న జేవీవీ సభ్యులు

రామచంద్రపురం: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రామచంద్రపురం పట్టణ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా నిర్వహిస్తున్న మాదిరిగా ఈ ఏడాది గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ జీవిత చరిత్రపై ఈ నెల 13న పట్టణంలో పాఠశాల స్థాయిలో 2000 మంది విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్షలు నిర్వహించగా అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 200 మందికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. వీరిలో నుంచి 6, 7, 8, 9 తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విద్యార్థులను ఎంపిక చేసి వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, పట్టణ గౌరవాధ్యక్షుడు జీవీ రావు, అధ్యక్షుడు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జిల్లా కార్యదర్శి పెదపాటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గరగ ఈశ్వరరావు, కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, కార్యవర్గ సభ్యులు శారద, పి.వెంకటేశ్వరరావుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెకుముకిలో అక్కాచెల్లెళ్ల ప్రతిభ



అక్కాచెల్లెళ్లు లక్ష్మీసాహితి, లక్ష్మీసలోని

రామచంద్రపురం రూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షలో ద్రాక్షారామకు చెందిన అక్కాచెల్లెళ్లు బట్టా లక్ష్మీసాహితి, బట్టా లక్ష్మీసలోని ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానం సాధించారు. 6వ తరగతి విభాగంలో లక్ష్మీ సలోని, 9వ తరగతి విభాగంలో లక్ష్మీసాహితి ద్వితీయ స్థానాలు పొందారు. అక్కాచెల్లెళ్లను, వారి తల్లిదండ్రులు నవీన్, గౌతమిలను పలువురు అభినందించారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కపిలేశ్వరపురం: అనుమతి లేకుండా మండలంలోని కోరుమిల్లి మీదుగా మోటారు సైకిళ్లపై మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను వేర్వేరుగా అరెస్ట్ చేసినట్టు అమలాపురం టాస్క్ ఫోర్స్ సీఐ కె.వీరబాబు తెలిపారు. రావులపాలేనికి చెందిన నిందితుడు కె.వీరవెంకట సుబ్బారెడ్డి నుంచి 87 బీరు, 8 విస్కీ బాటిళ్లను, మరో నిందితుడు భీమవరం జిల్లా అరవల్లి గ్రామానికి చెందిన కె.పద్మారావు నుంచి 128 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నేరం జరిగిన పరిధి కారణంగా ఆలమూరు ఎక్సైజ్ పోలీసులకు కేసు నమోదు నిమిత్తం నివేదించినట్టు సీఐ వీరబాబు తెలిపారు.

కాలనీలో పోస్టాఫీసు ఏర్పాటు చేయరూ !

- పోస్టల్ సేవల కోసం నాలుగు కిలోమీటర్ల ప్రయాణం
- గొల్లపుంత కాలనీ వాసుల విజ్ఞప్తి



గొల్లపుంత కాలనీ

మండపేట: పోస్టల్ సేవల కోసం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ నగర్ (గొల్లపుంత కాలనీ) ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని పోస్టాఫీసులకు రావాల్సి వస్తోంది. స్థానికంగా పోస్టాఫీసు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. 008లో దివంగత వైఎస్, అప్పటి ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి కృషితో పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి గొల్లపుంతలో 122.72 ఎకరాలు సేకరించారు. ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున సుమారు 1,900 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయగా ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన స్థలంలో తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం 6,400 మంది లబ్ధిదారులకు టిడ్కో ప్లాట్లు నిర్మించింది. మౌలిక వసతులు కల్పించి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇటీవల రెండు వేల మంది లబ్ధిదారులకు ప్లాట్లు స్వాధీనం చేయగా, మిగిలిన వారికి త్వరలో అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోస్టల్ సేవల కోసం ఇక్కట్లు

ఎంతోమంది గొల్లపుంత కాలనీ వాసులకు పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన తదితర ఖాతాలున్నాయి. ఆయా లావాదేవీల కోసం మండపేట మెయిన్ రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు, కేపీ రోడ్డులోని సబ్ పోస్టాఫీసుకు రావాలి. ఆటో సదుపాయం సరిగా లేక ప్రధానంగా వృద్ధులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఆటో పెట్టుకుని వచ్చేందుకు రూ. 300 వరకూ ఖర్చవుతోందని, లేదంటే పూట పనిపోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. సుకన్య సమృద్ధి యోజనపై ఇటీవల పోస్టల్ ఉద్యోగులు కాలనీలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రాజమహేంద్రవరం డివిజన్‌లోనే అత్యధికంగా ఇక్కడ ఖాతాలు తెరవడం గమనార్హం. ఇప్పటికే ఈ కాలనీలో రెండు వేల కుటుంబాలు నివసిస్తుండగా పూర్తిస్థాయిలో టిడ్కో ప్లాట్లు లబ్ధిదారులకు అప్పగించాక కాలనీ జనాభా 30,000 దాటుతుందని అంచనా. పోస్టల్ ఉన్నతాధికారులు తమ వెతలు గుర్తించి కాలనీలో పోస్టాఫీసు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అందుకోసం సంతకాల సేకరణ చేస్తున్నారు.

పోస్టాఫీసు ఏర్పాటు చేయాలి



గొల్లపుంత కాలనీలో ఎంతో మందికి పోస్టల్ ఖాతాలు ఉన్నప్పటికీ స్థానికంగా పోస్టాఫీసు లేకపోవడంతో పట్టణంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలనీలో పోస్టాఫీసు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–షేక్ మస్తాన్, కాలనీవాసి

భవిష్యత్తుకు ఎంతో అవసరం



కాలనీ భవిష్యత్తులో మినీ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుంది. ఇటీవల సుకన్య సమృద్ధి యోజన స్పెషల్ డ్రైవ్‌లో 70 మంది వరకు అకౌంట్లు ఓపెన్ చేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా పోస్టాఫీసు ఏర్పాటుచేయాలి.

– బి. దొరబాబు, కాలనీవాసి